నమస్తే తెలంగాణ
రంగారెడ్డి
11 హైదరాబాద్, గురువారం 15 ఫిబ్రవరి 2024 RANGAREDDY

# అక్రమాలకు పాల్పడితే సహించేది లేదు

స్థానిక పోలీస్‌స్టేషన్లలో న్యాయం జరగకపోతే

బాధితులు నేరుగా సీపీకి ఫిర్యాదు చేయొచ్చు

డ్రగ్స్ నియంత్రణపై ప్రత్యేక దృష్టి పెట్టాం

## నమస్తేతో సైబరాబాద్ సీపీ అవినాశ్ మహంతి



సిటీబ్యూరో, ఫిబ్రవరి 14 (నమస్తే తెలంగాణ): 'పోలీసు అధికారులు, సిబ్బంది, ఫిర్యాదుదారుల పట్ల పారదర్శకంగా వ్యవహరించాలి. చట్ట ప్రకారం నడుచుకోవాలి. చట్టాలను అమలు చేయాల్సిన పోలీసులే వాటిని ఉల్లంఘిస్తే ఎలా...ప్రజలకు న్యాయం చేసినప్పుడే వారికి పోలీసులంటే నమ్మకం పెరుగుతుంది. సిబ్బందిగాని అధికారులు గాని ఏ స్థాయివారైనా విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించినా.. అవకతవకలకు పాల్పడినా.. ఏకపక్షంగా వ్యవహరించినా ఉపేక్షించేది లేదు. అలాంటి వారిపై కఠినంగానే వ్యవహరిస్తాం. శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం'. అని సైబరాబాద్ పోలీసు కమిషనర్ అవినాశ్ మహంతి హెచ్చరించారు. సైబరాబాద్ సీపీగా బాధ్యతలు చేపట్టి నెలరోజులు పూర్తయిన సందర్భంగా 'నమస్తే తెలంగాణ'తో ప్రత్యేకంగా మాట్లాడారు. అవేమిటో ఆయన మాటల్లోనే..

### సాంకేతిక పరిజ్ఞానంతో..

విజిబుల్ పోలీసింగ్, పెట్రోలింగ్‌ను మరింత ముమ్మరం చేశాం. సాంకేతిక పరిజ్ఞానంతో నేర పరిశోధన, నివారణ చర్యలు చేపడుతున్నాం. ఐటీ, టెక్నికల్, లా ఎక్స్‌పర్ట్ సహకారంతో సైబర్ క్రైమ్ పోలీసులు సైబర్ నేరాలను ఛేదిస్తున్నారు. ఒక జనవరిలోనే 40 సైబర్‌క్రైమ్ కేసులు ఛేదించి సుమారు రూ.1,49,41,670 మొత్తాన్ని నేరస్తుల నుంచి రికవరీ చేసి, బాధితుల ఖాతాల్లో జమ చేశాం. సైబర్ మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. సైబర్ మోసాలకు గురైతే వెంటనే 1930 నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలి.

### డ్రగ్స్ నివారణపై ప్రత్యేక దృష్టి

కమిషనరేట్ పరిధిలో డ్రగ్స్ వినియోగం, విక్రయాలపై ప్రత్యేక దృష్టి పెట్టాం . మత్తు పదార్థాలు గ్రాము పరిమాణంలో లభించినా కఠినంగానే వ్యవహరిస్తాం. ముఖ్యంగా డ్రగ్స్ వల్ల యువత చెడుదారిపడుతున్నది. అందుకే మాదకద్రవ్యాల నివారణ కోసం స్పెషల్ ఆపరేషన్ టీమ్(ఎస్‌వోటీ) ప్రత్యేకంగా పనిచేస్తున్నది.

### అధికారులు స్పందించకపోతే..

స్థానిక పోలీస్ స్టేషన్లలో అధికారులు స్పందించకపోతే ఏసీపీ, డీసీపీ స్థాయి అధికారులకు ఫిర్యాదు చేయాలి. వారి నుంచి కూడా న్యాయం జరగకపోతే బాధితులు నేరుగా సీపీకి ఫిర్యాదు చేయవచ్చు. స్థానిక అధికారులను సంప్రదించకుండా నేరుగా సీపీ కార్యాలయానికి రావొద్దు. కిందిస్థాయి, మధ్యస్థాయి అధికారుల వద్ద సమస్య తీరనప్పుడు సీపీని సంప్రదించాలి.

# మరో నాలుగు రోజులే.. బుక్‌ఫెయిర్

సిటీబ్యూరో/ కవాడిగూడ, ఫిబ్రవరి 14 ( నమస్తే తెలంగాణ ) : ఎన్టీఆర్ స్టేడియంలో కొలువుదీరిన బుక్‌ఫెయిర్ ఈనెల 19తో ముగియనున్నది. మరో నాలుగు రోజులు మాత్రమే ఉండటంతో బుధవారం సందర్శకులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. కాగా, తంగేడుకుంట హెబ్బార్ నాగేశ్వరరావు రచించిన 'విద్యకు విముక్తి' పుస్తక ఆవిష్కరణ రవ్వా శ్రీహరి వేదికపై జరిగింది. ముఖ్య అతిథిగా డాక్టర్ చమర్తి ఉమామహేశ్వర రావు, బొప్ప భాస్కర్ పాల్గొన్నారు. అమృత రాజ్ రచించిన పిలుపు పుస్తక పరిచయ కార్యక్రమం జరిగింది. ఈ పుస్తకాన్నీ కేంద్ర సాహిత్య యువ పురస్కార గ్రహీత డాక్టర్ పసునూరి రవీందర్ ఆవిష్కరించారు. ప్రముఖ రచయిత ఓల్గా అనువాదం చేసిన 'హమీద్ దల్వాయ్' కథల పుస్తకాన్నీ ఉనుదుర్తి సుధాకర్ ఆవిష్కరించారు. శాస్త్రీయమైన స్వార్థ్యకారక దివ్యసంకల్పాలు' పుస్తకాన్ని స్వామి ప్రజ్ఞానంద విడుదల చేశారు. రవ్వా శ్రీహరి వేదికపై హైదరాబాద్ బుక్ ఫెయిర్ అధ్యక్షుడు జూలూరి గౌరీశంకర్ అధ్యక్షతన జరిగిన పగిడిపాల ఆంజనేయులు రాసిన 'హృదయ రాగం' పుస్తకాన్ని ప్రముఖ సినీ దర్శకుడు బీ. నర్సింగ్ రావు ఆవిష్కరించారు. రవ్వా శ్రీహరి వేదికపై కే. ఆనందచారి అధ్యక్షతన 'నేటి సామాజిక పరిణామం-రచయితల స్పందన' సెమినార్ జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రముఖ సాహితీ విమర్శకులు గుంటూరు లక్ష్మీ నర్సయ్య ,రచయితలు ఎన్ వేణుగోపాలు, జూపాక సుభద్ర, జూలూరు గౌరీశంకర్ తదితరులు పాల్గొన్నారు.

# ఈ నెల 17న సదరం క్యాంపులు



వికారాబాద్ కలెక్టర్ నారాయణరెడ్డి

వికారాబాద్, ఫిబ్రవరి 14 : వికారాబాద్ జిల్లాలోని దివ్యాంగుల సదరం క్యాంపునకు సంబంధించి ఈ నెల 17వ తేదీ ఉదయం 11 గంటల నుంచి మీసేవ కేంద్రాల్లో స్లాట్ బుక్ చేసుకోవాలని వికారాబాద్ కలెక్టర్ నారాయణరెడ్డి తెలిపారు. ఈనెల 19, 20, 23, 26, 27, మార్చి 08, 09, 16, 19, 30 తేదీల్లో తాండూరు ప్రభుత్వ దవాఖానలో నిర్వహించడం జరుగుతుందన్నారు. క్యాంపులకు స్లాట్ బుక్ చేసుకున్న దివ్యాంగులు, బుద్ధి మాంద్యం, చెవుడు మూగ ఉన్న దరఖాస్తుదారులు హాజరుకావాలన్నారు. ఈనెల 20, 21, 23, 27, మార్చి 06, 22, 26, 27 తేదీల్లో వికారాబాద్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో నిర్వహించే క్యాంపులకు అంగ వైకల్యం, అంధులు హాజరుకావాలన్నారు. ఈ క్యాంపులకు సదరం సర్టిఫికెట్ పొంది సర్టిఫికెట్ కాల పరిమితి అయి పోయిన వారితో పాటు, కొత్తగా స్లాట్ బుక్ చేసుకున్న వారు హాజరు కావాలని కలెక్టర్ సూచించారు.

# అంతకు మించి..

## ఈ ఏడాది జిల్లా వార్షిక రుణ ప్రణాళిక లక్ష్యం రూ.24,157.65 కోట్లు



- డిసెంబర్ నాటికి వివిధ రంగాలకు 147.17 శాతం మేర అప్పులు ఇచ్చిన బ్యాంకులు
- వ్యవసాయ రంగానికి 101.69 శాతం మేర రూ.5,930.72 కోట్ల రుణాలు అందజేత
- స్వయం సహాయక సంఘాలకు 97.15 శాతం మేర రూ.68,969.87 లక్షల రుణాల పంపిణీ
- జిల్లా సమగ్ర అభివృద్ధిలో కీలక భూమిక పోషిస్తున్న బ్యాంకులు, జిల్లా యంత్రాంగం

రంగారెడ్డి, ఫిబ్రవరి 14 (నమస్తే తెలంగాణ) : జిల్లా సమగ్ర అభివృద్ధిలో బ్యాంకులు కీలక భూమిక పోషిస్తున్నాయి. అన్ని వర్గాల ప్రజానీకానికి అండగా నిలుస్తున్నాయి. వార్షిక రుణ ప్రణాళికను పక్కాగా అమలు చేయించి బ్యాంకుల ద్వారా లక్ష్యానికి మించి రుణాలు అందించి ఆర్థిక భరోసాను నింపుతున్నాయి. ఇటీవల వెల్లడించిన వార్షిక రుణ ప్రణాళికలో అంతకుమించి అన్నట్లుగా బ్యాంకులు ఇతోధికంగా రుణాలను మంజూరు చేసినట్లు స్పష్టమవుతున్నది.

ఈ ఏడాది జిల్లా లీడ్ బ్యాంక్ రూపొందించిన వార్షిక రుణ ప్రణాళిక లక్ష్యం రూ.24,157.65 కోట్లు కాగా, డిసెంబర్ మాసం నాటికి రూ.35,553.73 కోట్ల మేర రుణాలను బ్యాంకులు వివిధ రంగాలకు అందించాయి. నిర్దేశిత లక్ష్యం కంటే 147.17 శాతం లక్ష్యాన్ని సాధించడంలో అటు బ్యాంకులు, ఇటు జిల్లా యంత్రాంగం కీలక పాత్ర పోషించింది. నిధుల కేటాయింపులో వ్యవసాయ రంగానికి పెద్దపీట వేసి పంట రుణాలను 3,550.6కోట్లు (127.15) డిసెంబర్‌లోనే లక్ష్యానికి మించి బ్యాంకులు రైతులకు అందజేశాయి.

**వ్యవసాయం, ఉపాధి రంగాలకు విరివిగా..**

జిల్లాలోని ప్రాధాన్యత, ప్రాధాన్యేతర రంగాలకు రుణాలు అందించేందుకు జిల్లా లీడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం ప్రణాళిక తయారవుతుంది. వార్షిక రుణ ప్రణాళిక ఆధారంగా ఆయా రంగాలకు బ్యాంకులు రుణాలను మంజూరు చేస్తాయి. ఈ ఏడాది గతానికి భిన్నంగా రెండు మూడు రంగాలకు మినహా ప్రణాళిక లక్ష్యానికి మించి రుణాలను బ్యాంకులు మంజూరు చేశాయి. పంట రుణాల లక్ష్యం 2,792.53 కోట్లు కాగా, బ్యాంకులు 3,550.61 కోట్లను రైతాంగానికి అందించాయి. ఉపాధి రంగాలకు ఊతమిచ్చేలా బ్యాంకులు రుణాలు ఇచ్చాయి. సూక్ష్మ, చిన్నతరహా పరిశ్రమలకు 7,686.39 కోట్ల రుణాలకుగాను ఇప్పటి వరకు 5,753.01(74.85) కోట్ల రుణాలను అందజేశాయి.



### 2023-24లో రుణ ప్రణాళిక లక్ష్యం..డిసెంబర్ నాటికి సాధించినది..

| రంగం | రుణ లక్ష్యం | ఇచ్చిన రుణం | శాతం |
|---|---|---|---|
| వ్యవసాయ | రూ.5,831.88 కోట్లు | రూ.5,930.72 కోట్లు | 101.69 |
| సూక్ష్మ, చిన్నతరహా పరిశ్రమలు | రూ.7,686.39 కోట్లు | రూ.5,753.01 కోట్లు | 74.85 |
| విద్యా | రూ.125.03 కోట్లు | రూ.68.17 కోట్లు | 54.52 |
| గృహ నిర్మాణం | రూ.1,156.68 కోట్లు | రూ.427.68 కోట్లు | 36.97 |
| ఇతర ప్రాధాన్యత | రూ.14,912.55 కోట్లు | రూ.12,323.91 కోట్లు | 82.66 |
| ప్రాధాన్యేతర | రూ.9,245.35 కోట్లు | రూ.23,226.82 కోట్లు | 251.23 |
| మొత్తం | రూ.24,157.65 కోట్లు | రూ.35,553.73 కోట్లు | 147.17 |

గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో కొనసాగుతున్న స్వయం సహాయక మహిళా సంఘాలకు 70,992.77 లక్షల రుణ లక్ష్యానికిగాను డిసెంబర్ నాటికి 68,969.87 (97.15 శాతం) కోట్ల రుణాలను పంపిణీ చేశారు. మెప్మా ఆధ్వర్యంలోని సంఘాలకు 9,834.63 లక్షల రుణాలను ఇవ్వాలని సంకల్పించి ఇప్పటి వరకు రూ.9,037.57 (91.90 శాతం) లక్షల రుణాలను బ్యాంకులు అందజేశాయి.

**ఆయా రంగాల్లో వెనుకంజే..**

జిల్లాలో కొన్ని రంగాలకు రుణాలు ఇవ్వడంలో బ్యాంకర్లు వెనుకంజలో ఉన్నారు. ఏటీఎల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కింద కోల్డ్ స్టోరేజీ, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లకు సంబంధించి రుణాలను అందజేయడంలో బ్యాంకులు వెనుకబడ్డాయి. రూ.447.13కోట్ల రుణ లక్ష్యానికిగాను 61.60 (13.78) కోట్లను మాత్రమే అందించి మమ అనిపించాయి. విద్యా రంగానికి రూ.125.03 కోట్ల రుణాలను అందించాల్సి ఉండగా.. 68.17 (54.52 శాతం) రుణాలను మాత్రమే బ్యాంకులు ఇచ్చాయి. పేద, మధ్య తరగతి ప్రజలు ఎక్కువగా ఇండ్లను నిర్మించుకోవడానికి బ్యాంకు రుణాలపై ఆధారపడతారు. ఇండ్లను నిర్మించాలంటే రూ.లక్షల్లో ఖర్చు చేయాల్సి ఉంటుంది. ప్రజల అవసరాల మేరకు బ్యాంకులు గృహ రుణాలను మాత్రం అందించలేక పోతున్నాయి. ఈ ఏడాదిలో రూ.1,156.68 కోట్ల రుణాలు ఇవ్వాల్సి ఉండగా.. ఇప్పటి వరకు 427.68 (36.97) కోట్ల రుణాలను మాత్రమే ఇవ్వగలిగారు. ఆర్థిక సంవత్సరం ముగియడానికి ఇంకా నెలన్నర రోజులు మిగిలిపోవడంతో రుణ లక్ష్యంలో వెనుకబడ్డ రంగాలకు లక్ష్యం మేరకు రుణాలు అందజేస్తామని బ్యాంకర్లు చెబుతున్నారు.

# వారం రోజుల్లో సీఎం టూర్

- పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేసేందుకు ఏర్పాట్లు
- 'కడా' ఆధ్వర్యంలో ప్రతిపాదనలు...
- అభివృద్ధి పనులకు రూ.3695 కోట్లు మంజూరు చేసిన ప్రభుత్వం
- రూ.2945 కోట్లతో కొడంగల్ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు మంజూరు
- రెండు జూనియర్ కాలేజీలు, మహిళా డిగ్రీ కాలేజీ మంజూరు
- టీఎస్‌ఐఐసీ ఆధ్వర్యంలో రెండు కాలుష్యరహిత పరిశ్రమల ఏర్పాటుకు నిర్ణయం

వికారాబాద్, ఫిబ్రవరి 14, (నమస్తే తెలంగాణ): కొడంగల్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ(కడా)ని ఏర్పాటు చేసిన ప్రభుత్వం చైర్మన్‌గా వికారాబాద్ జిల్లా కలెక్టర్‌ను, ప్రత్యేకాధికారిగా ఆర్డీవో వెంకట్‌రెడ్డిని నియమించిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో కొడంగల్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ ప్రత్యేకాధికారులు అభివృద్ధి ప్రణాళికలు సిద్ధం చేశారు. రోడ్ల అభివృద్ధితోపాటు మంచినీటి సౌకర్యం, మెరుగైన వైద్యం, నాణ్యమైన విద్యను అందించేందుకుగాను పంచాయతీరాజ్ రోడ్ల అభివృద్ధి, ఆర్‌అండ్‌బీ రోడ్ల అభివృద్ధికి భారీగా నిధులు మంజూరు చేయడంతోపాటు ఇప్పటికే జిల్లాకు ప్రభుత్వ మెడికల్ కాలేజీని మంజూరు చేసిన ప్రభుత్వం, కొడంగల్ నియోజకవర్గానికి ప్రత్యేకంగా ప్రభుత్వ మెడికల్ కాలేజీని మంజూరు చేయడంతోపాటు ఇంజినీరింగ్, జూనియర్, డిగ్రీ కాలేజీలను మంజూరు చేసింది. ప్రత్యేకంగా కొడంగల్ నియోజకవర్గానికి సాగునీరందించేందుకుగాను ఎత్తిపోతల ప్రాజెక్టును ప్రభుత్వం మంజూరు చేయడం గమనార్హం. మరోవైపు కొడంగల్ నియోజకవర్గ అభివృద్ధిలో భాగంగా ఇప్పటివరకు రూ.3695 కోట్ల అభివృద్ధి కార్యక్రమాలను ప్రభుత్వం మంజూరు చేసింది. కొడంగల్ నియోజకవర్గానికి మంజూరైన అభివృద్ధి ప్రాజెక్టుల ఏర్పాటుకుగాను స్థలాల గుర్తింపు పనిలో కడా అధికారులు నిమగ్నమయ్యారు. ప్రభుత్వ, అసైన్డ్ భూముల వివరాలను సేకరించి, వివరాలను ప్రభుత్వానికి అందజేయగా, ఏ ప్రాజెక్టు ఎక్కడ చేపట్టనున్నారనే దానిపై సీఎం నిర్ణయం తీసుకోనున్నట్లు తెలిసింది.

**రూ.2945 కోట్లతో కొడంగల్ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్...**

కొడంగల్ నియోజకవర్గ అభివృద్ధికి ఇప్పటివరకు రూ.3695 కోట్ల అభివృద్ధి పనులను మంజూరు చేసిన ప్రభుత్వం,వీటిలో ప్రధానంగా రూ.2945 కోట్లతో కొడంగల్ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును ప్రభుత్వం మంజూరు చేసింది. కొడంగల్ నియోజకవర్గంలోని ప్రతీ ఎకరాకు సాగు నీరందించే విధంగా కొడంగల్ ఎత్తిపోతల నీటిపారుదల ప్రాజెక్టును తీసుకువచ్చారు. కొడంగల్ నియోజకవర్గంతోపాటు నారాయణపేట, మక్తల్ నియోజకవర్గాలకు సంబంధిత లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు ద్వారా సాగు నీరందించనున్నట్లు తెలిసింది. దీంతో కొడంగల్ నియోజకవర్గంలోని 1.20 లక్షల ఎకరాలతోపాటు మిగతా నారాయణపేట, మక్తల్ నియోజకవర్గాలకు సాగు నీరందనున్నది.

**కొడంగల్‌కు మెడికల్ కాలేజీ మంజూరు...**

కొడంగల్ నియోజకవర్గంలో వైద్యవిద్యను బలోపేతం చేసే విధంగా ప్రభుత్వ మెడికల్ కాలేజీతో నర్సింగ్, ఫిజియోథెరపీ, పారామెడికల్ కాలేజీలను మంజూరు చేయడంతోపాటు ప్రారంభానికిగాను రూ.224 కోట్లతో పరిపాలన అనుమతులను కూడా ఇచ్చింది. కొడంగల్ నియోజకవర్గ కేంద్రంలో ప్రభుత్వ మెడికల్ కాలేజీని ఏర్పాటు చేయనున్నారు. 2025-26 విద్యా సంవత్సరానికిగాను 50 ఎంబీబీఎస్ సీట్లతో ప్రభుత్వ మెడికల్ కాలేజీని ప్రారంభించనున్నారు. అదేవిధంగా 60 సీట్లతో నర్సింగ్ కాలేజీ, 50 సీట్లతో ఫిజియోథెరపీ కాలేజీ, 30 సీట్లతో పారా మెడికల్ కాలేజీలను ఏర్పాటు చేయనున్నారు. అయితే పారా మెడికల్, నర్సింగ్, ఫిజియోథెరపీ కాలేజీలను కొడంగల్ నియోజకవర్గ కేంద్రంలోనే ఏర్పాటు చేయనున్నారు. అంతేకాకుండా కొడంగల్‌లోని 50 పడకల కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను 220 పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేయనున్నారు. మరోవైపు కొడంగల్ నియోజకవర్గానికి ఇంజనీరింగ్ కాలేజీని కూడా ప్రభుత్వం మంజూరు చేసింది. అయితే ఇంజనీరింగ్ కాలేజీని కోస్గిలో ఏర్పాటు చేసేందుకు అధికారులు స్థలాల గుర్తింపు పనిలో నిమగ్నమయ్యారు. అదేవిధంగా రెండు ప్రభుత్వ జూనియర్ కాలేజీలు కూడా మంజూరుకాగా, ఒకటి బొంరాసుపేట్ మండలంలో ఏర్పాటు చేస్తుండగా, మరో కాలేజీ ఎక్కడ ఏర్పాటు చేయాలనేది నిర్ణయించాల్సి ఉంది. అదేవిధంగా మహిళా డిగ్రీ కాలేజీని కూడా ప్రభుత్వం మంజూరు చేసింది. అయితే సంబంధిత జూనియర్, డిగ్రీ కాలేజీలను సొంత భవనాల్లోనే నిర్వహించేలా ప్రతిపాదించడంతోపాటు స్థలాలను గుర్తిస్తున్నారు.

**రోడ్ల అభివృద్ధికి భారీగా నిధులు...**

కొడంగల్ నియోజకవర్గంలోని పంచాయతీరాజ్ రోడ్ల అభివృద్ధికిగాను రూ.204 కోట్ల నిధులను మంజూరు చేయగా, ఆర్‌అండ్‌బీ రోడ్ల అభివృద్ధికిగాను రూ.322 కోట్ల నిధులను ప్రభుత్వం మంజూరు చేసింది. ప్రస్తుతం ఉన్న సింగిల్ రోడ్లను డబుల్ రోడ్లుగా, డబుల్ రోడ్లను నాలుగు లేన్ల రోడ్లుగా ఏర్పాటు చేయనున్నారు. అంతేకాకుండా ప్రతీ గ్రామ పంచాయతీల్లోనూ సీసీ రోడ్లను వేయనున్నారు. అంతేకాకుండా అవసరమైన చోట వంతెనలను కూడా నిర్మించనున్నారు.



కొడంగల్ మండలంలోని అప్పాయిపల్లిలో మెడికల్ కాలేజీ నిర్మాణం కోసం స్థలాన్ని పరిశీలిస్తున్న వైద్య కార్యదర్శి రాణికుముదిని, వికారాబాద్ కలెక్టర్ నారాయణరెడ్డి

**రెండు పారిశ్రామిక కేంద్రాలు...**

కొడంగల్ నియోజకవర్గంతోపాటు వికారాబాద్ జిల్లా సమగ్రాభివృద్ధికిగాను ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా ఇప్పటికే జిల్లాకు మంజూరైన మొబిలిటీ వ్యాలీ పనులను వేగవంతం చేయగా, త్వరలో మరో రెండు కాలుష్యరహిత ఇండస్ట్రియల్ పార్కులను ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదించారు. ఫార్మా ఇండస్ట్రీలతోపాటు వ్యవసాయ సంబంధిత పరిశ్రమలను టీఎస్‌ఐఐసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్నారు. అయితే పూడూర్, నవాబుపేట్ మండలాల్లో అసైన్డ్, ప్రభుత్వ భూములు ఎక్కువగా ఉన్న దృష్ట్యా సంబంధిత పారిశ్రామిక కేంద్రాలను ఇక్కడ ఏర్పాటు చేసే అవకాశాలున్నట్లు తెలిసింది. అదేవిధంగా చేపల పెంపకాన్ని మరింత ప్రోత్సహించే విధంగా కోట్‌పల్లిలో చేపల పెంపకానికి సంబంధించిన ఆక్వా ఇండస్ట్రీని ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదించారు. అదేవిధంగా అనంతగిరి ఎకో టూరిజం అభివృద్ధికి ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో స్వదేశ్ దర్శన్‌లో భాగంగా టూరిజం అభివృద్ధి ప్రక్రియ జరుగుతుండగా, రాష్ట్ర ప్రభుత్వం అనంతగిరి టూరిజం అభివృద్ధికిగాను ప్రత్యేకంగా నిధులిచ్చేందుకు నిర్ణయించగా, అధికారులు ప్రతిపాదనలను సిద్ధం చేస్తున్నారు.

**వారం రోజుల్లో సీఎం చేతుల మీదుగా శంకుస్థాపనలు...**

కొడంగల్ నియోజకవర్గానికి మంజూరు అయిన అభివృద్ధి పనులను సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా శంకుస్థాపనలు చేయనున్నారు. ఈనెల 5వ తేదీనే కొడంగల్ నియోజకవర్గంలో సీఎం పర్యటన ఉన్నప్పటికీ అసెంబ్లీ సమావేశాల దృష్ట్యా వాయిదా పడగా, ఈనెల 17 లేదా 18 తేదీల్లో సీఎం కొడంగల్ నియోజకవర్గంలో పర్యటించనున్నట్లు తెలిసింది. కొడంగల్ నియోజకవర్గ అభివృద్ధికి మంజూరైన అభివృద్ధి పనులన్నింటికీ కొడంగల్ నియోజకవర్గ కేంద్రంలోనే ఒకేచోట శంకుస్థాపన చేయనున్నారు.



## రాచకొండ కమిషనర్‌గా.. తరుణ్ జోషి బాధ్యతలు

సిటీబ్యూరో, ఫిబ్రవరి 14 (నమస్తే తెలంగాణ) : రాచకొండ కమిషనర్‌గా నియమితులైన తరుణ్ జోషి.. బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా కమిషనరేట్ పరిధిలోని డీసీపీలు, ఏసీపీలతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. శాంతి భద్రతల పరిరక్షణకు అవసరమైన అన్ని రకాల చర్యలు తీసుకుంటామని, డ్రగ్స్‌పై ఉక్కుపాదం మోపుతామని, సైబర్‌నేరాల కట్టడికి ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు.

# భక్తిపారవశ్యం

## ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఘనంగా వసంత పంచమి వేడుకలు



నందివనపర్తి జ్ఞానసరస్వతీ దేవాలయంలో చిన్నారికి అక్షరాభ్యాసం చేయిస్తున్న విద్యారణ్యభారతి స్వామిజీ

ఉమ్మడి రంగారెడ్డి జిల్లావ్యాప్తంగా బుధవారం వసంత పంచమి మహోత్సవాలు ఘనంగా జరిగాయి. ఉదయం నుంచే సరస్వతీ దేవి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. అమ్మవారికి భక్తిశ్రద్ధలతో అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. ఆలయాల్లో చిన్నారులకు అక్షరాభ్యాస కార్యక్రమాలను నిర్వహించారు. అమ్మవారిని ఊరేగింపుగా పల్లకీ సేవ నిర్వహించారు.



ఇబ్రహీంపట్నంలోని సరస్వతీ ఆలయంలో అక్షరాభ్యాస కార్యక్రమానికి హాజరైన చిన్నారులు, తల్లిదండ్రులు